# అవగాహన

సత్యనారాయణ చాలాకాలంగా కథలు రాస్తున్నాడు. చాలామందిలాగే మొదట్లో అతనూ తనకథల్ని ప్రశంసిస్తూ పాఠకులురాసిన ఉత్తరాల్ని దాచుకుని అప్పుడప్పుడూ చదువుకుంటూ, గర్వపడుతూ, సంతోషిస్తూ రాయబోయే రచనలకు వాటిని ప్రేరణగా తీసుకుంటూ వుండేవాడు. అయితే రానురానూ అట్లాంటి ఉత్తరాలిచ్చే ప్రోత్సాహం తగ్గిపోయింది. "ఇట్లాంటి కథ మే మెన్నడూ చదవలేదు" లాంటి ఉత్తరాలు అన్నిపత్రికల్లోనూ అన్ని కథలకూ రావడం గమనించేసరికి ఆశ్చర్యంకలిగింది. ఇంకొంచెం శ్రద్ధగా గమనించే సరికి, ఆ ఎన్నడూ చదవని పాఠకులు, ఇప్పుడు కూడా చదవకుండా అట్లాంటి ఉత్తరం రాయగలరని అర్థమయింది. అదుగో ....... అప్పుడూ ఆ ఉత్తరాలమీద అతనికి నమ్మకం పోయింది. అంతవరకూ దాచుకున్న ఉత్తరాలన్నిట్నీ కట్టకట్టి దొడ్డివెనకాలున్న బూడిద కుప్పమీదవేసి తగల బెట్టాడు. అందులో 'హైలైట్' ఉత్తరాలు చాలా వున్నాయేమో మంట ఇంతెత్తున లేచింది.

ఆ ఉత్తరదహనం తర్వాత సత్యనారాయణ తాత్కాలికంగా కొంత డీలాపడిపోయాడు. ఆ ఉత్తరాల వల్ల తన కేమీ ప్రయోజనం లేదనుకున్నాడు. మరి పని కొచ్చేవేమిటి? ఈ ప్రశ్నకు సులభంగానే సమాధానం దొరికింది. ఎందుకంటే అతన్లో అటువంటి అన్వేషణ అంతకు ముందునుంచే ప్రారంభమయింది కనుక. "అకారణప్రశంసలతో కూడిన వెయ్యి వెర్రి ఉత్తరాలకన్నా సకారణ విమర్శతో కూడిన ఒక్క ఉత్తరం మేలు చేస్తుంది" అన్న చైతన్యం అప్పటికే అతన్లో మేలుకుంది కనుక. అటువంటి ఉత్తరాలెట్లా వస్తాయి? ఉత్తరాలు కాకపోతే పోనీ, అటువంటి అభిప్రాయాల నైనా ఎట్లా సంపాదించడం?

అటువంటి దశలో సత్యనారాయణకు పరిచయమయ్యాడు నరసయ్య. 'కళ్ళు' నాటకం చూసినప్పుడు మొట్టమొదట పరిచయమయ్యాడు. సత్యనారాయణకు నాటకప్రదర్శనకు సంబంధించిన పరిజ్ఞానమూలేదు. నాటక, నాటిక ప్రక్రియలమీద అభిమానమూలేదు. ఆ

నాటకానికి దర్శకుడూ తన స్నేహితుడూ అయిన సుబ్బారావు అది గొప్ప నాటకమనీ తప్పక చూడాలనీ వత్తిడి చెయ్యడంతో వెళ్ళాడు. నాటకం చాలా బావుందనిపించిందతనికి. ఆ సంగతి సుబ్బారావుకు చెప్పి, అభినందించి వస్తూండగా, రోడ్డు మీద ఓ దీపస్తంభందగ్గర నలుగురైదుగురు నాటకం గురించి మాట్లాడుకోవడం కనిపించింది. దగ్గరగా వెళ్ళాక, అది మాట్లాడుకోడం కాదనీ వాదించుకోడం అనీ అర్థమయింది. ఇంకాగమనిస్తే వాదించుకోడం కూడా కాదని తేలింది. ఒకతను, ఒకేరకం అభిప్రాయం ప్రకటిస్తున్న నలుగురిని ఎదుర్కొని జరుపుతున్న పోరాటం అది. ఆ నలుగురూ అది గొప్ప నాటకం అంటుండగా, అతను అది 'గొప్ప తప్పుడు నాటకం' అంటున్నాడు.

ఆ నలుగుర్లో ఒకరైన రామారావు "హలో! సత్యనారాయణా! మీరూ నాటకం నుంచేనా?" అని పలకరించాడు. సత్యనారాయణ ఆగిసమాధానం చెప్పాడు. ఈవ్యవధిలో రామారావు మిగతా వాళ్లని పరిచయం చేశాడు. నిజానికి ఆ సందర్భంలో అంత మందిని పరిచయం చేయవలసిన అవసరం లేదు. నరసయ్యతో పోట్లాడలేక, దానికి ముగింపు చెబుదామనే రామారావు అట్లా పరిచయాల డైవర్షన్ వెతుక్కున్నట్టు సత్యనారాయణ కు అర్థమయింది. రామారావు ఇంతశ్రమపడినా నరసయ్య తన పోరాటాన్ని ఆపలేదు. "ఇతను సత్యనారాయణ అని మంచిరచయిత" అని పరిచయం చేస్తున్నానరసయ్య తగిన మర్యాద చూపలేదు, ఊరికే అట్లా చెయ్యూపి, మళ్లా యుద్ధానికి తలపడ్డాడు. సత్యనారాయణ నవ్వుతూ ముందుకు అడుగేశాడు. అప్పటికి నరసయ్యను వొట్టిమూర్ఖుడనే అనుకున్నాడు సత్యనారాయణ. 'రచయిత' అంటూ పరిచయం చేస్తూన్నా తనపట్ల ఏమాత్రం కుతూహలం చూపకపోవడం కొంచెం కోపం కలిగిస్తోంది.

ఆ తర్వాత నరసయ్యను గురించిన మరికొన్ని వివరాలు రామారావు ద్వారా తెలిశాయి. నరసయ్య పెళ్ళి చేసుకోలేదు, ఒంటరిగానే వుంటాడు. ఆర్.ఎం.పి. డాక్టరుగా మేదర వీధిలో ఎక్కడో వుంటాడు. ఒకప్పుడు నాటకాలు వేశాడు, ఏవోరచనలు కూడా చేశాడు....... ఇట్లా. చిత్రమేమిటంటే నరసయ్యను "మూర్ఖుడిలావున్నాడే" అంటే రామారావు వొప్పుకోకపోవడం! అంతకంటే ఆశ్చర్యకరమైన మాటకూడా రామారావు అన్నాడు. "ఆ రోజు అతని వాదం చూసి మీరట్లా అనుకున్నారేమో! తన అభిప్రాయం మీద గట్టిగా నిలబడ్తాడు. అయినా అందులో అతనే రైటు. 'కళ్ళు' నాటకం చేసిన ప్రతిపాదన తప్పుడుదని ఇప్పుడు నాకూ అనిపిస్తోంది." ఆ మాటకు సత్యనారాయణ కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాడు. ఆ తర్వాత నరసయ్య అభిప్రాయం గురించి రామారావు మరి కొంత వివరించాడు. అదివిని, ఆలోచించిన తర్వాత సత్యనారాయణ కూడా రామారావు వచ్చిన నిర్ణయానికే

వచ్చాడు. అయితే, ఆవిషయం తనకెందుకు తెలీలేదు? అంటే తన ఆలోచన సక్రమంగా లేదు. సక్రమమైన ఆలోచనలేని తనురాసే కథలు మాత్రం సరైనవిగా ఎట్లా వుంటాయి?

ఆ తర్వాత ఏదో కథరాసినప్పుడల్లా "ఈ కథ నరసయ్యకు నచ్చుతుందా?" అని ఆలోచింపసాగాడు సత్యనారాయణ. అదేమిటి? పాఠకులకోసం కథరాయాలికానీ, నరసయ్య ఒక్కడి కోసం కథరాస్తామా? అనీ ప్రశ్నించుకున్నాడు. నరసయ్య 'ఒక్కడు' కాడు. విచక్షణా జ్ఞానం వున్న ఒక పాఠకవర్గం. రచయిత కోరుకోవలసింది అటువంటి పాఠకవర్గాన్ని. అటువంటి పాఠకులున్నప్పుడే అటురచయితకూ, ఇటు పాఠకులకూ ప్రయోజనం కలిగేది. లేకపోతే, ఉభయులకూ పనికి మాలిన కాలక్షేపం తప్ప కలిసివచ్చేదేదీలేదు. తన రచయితంటూ లేని పాఠకులుండొచ్చుకానీ, తన పాఠకులంటూ లేని రచయితవుండడు. కనుక, "ఈ కథనరసయ్యకు నచ్చుతుందా?" అని ఆలోచించడంలో ఎటువంటి పొరపాటూ లేదు. సత్యనారాయణ ఇటువంటి నిర్ధారణకు వచ్చిన తర్వాత, మరో అవసరం ఏర్పడింది. అది నరసయ్యకు నచ్చిందో, లేదో కనుక్కోవడం, తన పాత కథల్లో ఏదో ఒకదాన్ని ఇచ్చి. దీనిమీద అభిప్రాయం చెప్పండని అడగడం బావుండదు. అదీగాక, తనపాత కథలు తనకే కొంత అసంతృప్తి కలిగిస్తాయి. తనకే బాగా లేనట్టుకనిపించే కథలపై నరసయ్య అభిప్రాయం కనుక్కోడమెందుకూ?

సత్యనారాయణ ఇటువంటి సందిగ్ధస్థితిలో వుండగా, 'తొలకరి' పత్రిక నిర్వహించిన కథల పోటీలో తన కథ ప్రథమ బహుమతి అందుకుని, ఆ నెల్లో అచ్చయివచ్చింది. కథపేరు 'వ్యత్యాసాలు'. పోటీలో బహుమతి అందుకోవడమన్నది నరసయ్య లాంటి వాళ్ళకు ప్రమాణంగా కనిపించదని సత్యనారాయణ కు తెలుసు. అయితే, కథ తనకూ సంతృప్తికరంగానే వుంది. బహుమతి అర్హత కానట్టే, అనర్హతకూడా కాదుకదా! (కొండొకచో అనర్హతేనన్నది అప్పటికి సత్యనారాయణకు తెలిసివుండకపోవచ్చు.) ఆ కథపై నరసయ్య అభిప్రాయం కనుక్కోవాలి. ఈ మధ్య రెండు మూడు సార్లు నరసయ్య బజార్లో కనిపించి, "బావున్నారా?" అని అడిగాడు కనుక, కథపై అభిప్రాయం అడగడం మరీ ఆరాటంగానూ, ఎబ్బెట్టుగానూ వుండదు,. కావలసింది నరసయ్య కనిపించడం. అతను హఠాత్తుగా ఎక్కడో మెరుపులా కనిపించి, మెరుపులాగానే పోతాడు. ఆ మెరుపు కనిపించినప్పుడు, అప్పటి కప్పుడు కథను చూపించేదెట్లా? ఇక పత్రికను చంకలో పెట్టుకుని వీధివీధినా నరసయ్య కోసం వెతుకుతూ వుండాలి.

నరసయ్య మేదర వీధిలో వుంటున్నట్టు ఇంతకుముందు రామారావు చెప్పిన సంగతి జ్ఞాపకమొచ్చింది. మేదర వీధి అంటే పెద్దదేం కాదు. పైగా ఆర్.యం.పి. డాక్టర్

కనుక కనుక్కోవడం సులువే. ఇట్లా తీర్మానించుకున్న తర్వాత ఓ సాయంత్రం (ఆ మరుసటి రోజు సాయంత్రమే) పత్రికను చేత ధరించి. రిక్షాను అధిరోహించి మేదర వీధికి బయల్దేరాడు. అంతకు ముందు రోజే వర్షం కురిసినందువల్ల వీధంతా బురద బురదగా వుంది. గోచీలు పెట్టుకున్నముసలోళ్ళు కొందరు బుట్టలు అల్లుతూనో, వెదుళ్ళు చీల్చుకుంటూనో వుండగా, పెద్దపెద్ద కొప్పులతో చిరిగిన రవికెలూ, చీరెల్తో వున్న ఆడవాళ్ళు ఇళ్ళముందు ఇంతెత్తున బుట్టలూ, చేటలూ గుట్టలుగా పోసుకునివున్నారు. వీధిలో దిగకుండా, ఎవర్తో మాట్లాడకుండా రిక్షాలో వెళ్తున్నా, ఆ వీధీ, ఆ మనుషులూ సత్యనారాయణకు చిరాకు కలిగించారు. "ఛీ! ఛీ!" అన్నాడు. అతను ఛీ! ఛీ! అన్నదెందుకో అర్థం చేసుకున్న రిక్షా అతను "యీ యీదియింతేనండీ, రోతరోతగా వుంటాది" అన్నాడు. 'ఇది మేదరవీధి కాదు, ఛీదర వీధి' అనుకుని నవ్వుకున్నాడు. తను ఇప్పుడు నరసయ్యకు చూపించాలని తీసుకువెళ్తున్నకథ పేదలమీద సానుభూతితో రాసిందే నన్న సంగతి సత్యనారాయణ కప్పుడు జ్ఞాపకం రాలేదు. బహుశా తనురాసింది 'మేదర పేదల' గురించి కాదు కనుక, జ్ఞాపకం రాలేదేమో! ఎవరైనా జ్ఞాపకం తెస్తే "పేదలంటే సానుభూతేనయ్యా, ఆ ఆడోళ్ళు చూడు! కాస్తతల దువ్వుకోడానికేమయింది? దానికీ పేదరికానికీ ఏంసంబంధం?" అని వాదించేవాడేమో!

మొత్తంమీద మేదర వీధి. ఏకైక వీధి కనుక, రిక్షాలో కూచునే అటూ ఇటూ చూస్తూ, ఓచోట ఆర్. నరసయ్య ఆర్.యం.పి. అనివున్న బోర్డును కనిపెట్టి, రిక్షా ఆపమన్నాడు. అది రెండుగదుల పెంకుటిల్లు. మొదట చిన్నగదిలో వున్న రెండుబెంచీల మీదా అయిదారుగురు ఆడాళ్ళూ మగాళ్ళూకూచొని వున్నారు. లోపలున్న ఇంకోపెద్దగదిలో, బెంచీ మీద పడుకున్న ఒకామెకాలికి, పక్కన్నే స్టూలుమీద కూచొని కట్టుకడుతున్నాడు నరసయ్య. ఆమె మొగుడేమో నిక్కరూ, బనియనూ వేసుకుని దుబ్బుమీసాలతో వున్న ఒకతను నరసయ్యకు సహకరిస్తూ, ఆమెను పొదివిపట్టుకునున్నాడు. తనగదిలో అలవాటైన పాదాలచప్పుడు కాక, కొత్తచప్పుడు వినిపించినట్లై తలెత్తిన నరసయ్యకు సత్యనారాయణ కనిపించినాడు. "మీరా....... రండి" అని ఆహ్వానిస్తూ, "సంటెన్నా! ఆమూలనున్న కుర్చీపట్టుకురా" అన్నాడు. ఆమనిషి పరుగెత్తుకెళ్ళినట్టు వెళ్ళి కుర్చీ తెచ్చాడు. "ఏమిటిలావచ్చారు?" అన్నట్టున్న నరసయ్య చూపుకు, పక్కవీధిలో ఏదో పనుండి వచ్చినట్టూ, నరసయ్య యీ వీధిలో వున్నట్టు జ్ఞాపకం వచ్చాక పలకరించి వెళ్దామని వచ్చినట్టూ........ చెప్పాడుసత్యనారాయణ. అబద్ధం చెప్పినందుకు, మనస్సులో కొంత పీకినా, 'ఆ మాత్రం లౌక్యం తప్పదు' అనిసర్దుకున్నాడు. కాకపోతే, తనంతటతను కథతీసుకొచ్చినట్టు ఎట్లా చెబుతాడు?

"ఒక్క నిమిషం" అంటూ నరసయ్య ఆమె కాలికి కట్టుకట్టడం పూర్తిచేసి, "ఇకతీసుకెళ్ళు, ఆమాత్రలు వాడు" అని అతనికి సలహాఇచ్చాడు. ఆ నిక్కరు మనిషి ఆడమనిషిని చేతుల్లో కెత్తుకుని వీధిలో కూడా అట్లాగే తీసుకెళ్ళడం చూసిన సత్యనారాయణ ఆశ్చర్య పోయాడు. ఆ ఆశ్చర్యాన్ని గమనించిన నరసయ్య "ఇల్లు దగ్గరే" అన్నాడు. దగ్గరైతే మాత్రం! "ఛీ! ఛీ" అని మళ్ళీ అనుకున్నాడు. "సినిమాల్లో హీరో హీరోయిన్ని ఎంతసేపు ఎత్తుకున్నా మనకు బాగానే వుంటుంది. ఓ మనిషి గత్యంతరం లేని పరిస్థితిలో భార్యను ఎత్తుకుంటే అసహ్యంగా వుంటుంది" అన్నాడు నరసయ్య. సత్యనారాయణ తత్తరపడుతున్నట్టు "అదికాదు.... అదికాదు" అన్నాడు. "మరేది?" అన్నట్టు నరసయ్య ఓక్షణం చూసి, ముఖంలోని సీరియస్‌నెస్‌ని చెరుపుకుని, మామూలు నవ్వులో కొచ్చాడు. నరసయ్య, నల్లగా కమిలిపోయినట్టున్న ముఖంతో, పొట్టిగా బట్టతలతో వుంటాడు. నవ్వితేమాత్రం ఆ కమిలిపోయినట్టున్న ముఖం నిండా భళ్ళున కాంతి పరుచుకుని, అట్లాగే చూడాలనిపిస్తుంది. "ఏమిటా పత్రిక? చూడొచ్చా" అని , చేయిచాపాడునరసయ్య. "ఇది తొలకరి పత్రిక" అంటూ తొలకరిస్తున్న సంతోషంతో ఇచ్చాడు సత్యనారాయణ. నరసయ్య పత్రికను అలా తిరిగేస్తూ, "ఇందులో మీ కథ కూడా వుందే! ఓహో ...... ప్రైజ్ కూడా వచ్చిందే" అన్నాడు. సత్యనారాయణ చిరునవ్వుతో తలూపాడు. "చదవొచ్చా?" "చదవండి, తర్వాతే ఇవ్వొచ్చు" అన్నాడు సత్యనారాయణ. తనపని కొంచెం గౌరవప్రదంగానెరవేరినట్టనిపించి సంతోషించాడతను.

ఆ తర్వాత ఓ మూల బల్ల పైవున్న ఫ్లాస్కులో నుంచీ రెండు కప్పుల్లో 'టీ' తెచ్చాడు నరసయ్య. "ఎంత కాలం నుంచీ కథలు రాస్తున్నారు?" అనడిగాడు. సత్యనారాయణ చెబుతూ, ప్రస్తుతం తనుసరైనసలహాల కోసం ఎదురు చూస్తున్నట్టు చెప్పాడు. "ఇంతకాలం నుంచీ రాస్తున్నా, ఇంకా సలహాలకోసం ఎదురుచూస్తున్నారా? ఎదురులేని వీరుడిలా బహుమతులందుకుంటూ దూసుకుని, ర్గాసుక్కుని పోక!" అని బిగ్గరగా నవ్వాడు నరసయ్య. సత్యనారాయణానవ్వాడు. "సలహాలు ఎప్పటికీ అవసరమే" అన్నాడు నమ్రతగా. "సలహాలు కాదుకానీ, మీ కథ చదివాక నా అభిప్రాయం చెబుతాను" అన్నాడు నరసయ్య. "అట్లాగే" అనివచ్చాడు సత్యనారాయణ.

అప్పట్నించీ దాదాపు ఇరవైరోజులవరకూ ఎక్కడాకనపల్లేదు నరసయ్య. తనకథగురించి నరసయ్య అభిప్రాయం తెలుసుకోవాలని తహతహగా వుంది సత్యనారాయణకు. దానికోసం మళ్ళీ 'మేదర వీధి' లో వున్న నరసయ్య దగ్గరికి వెళ్ళాలంటే మనస్కరించడం లేదు. కథ తీసుకెళ్ళి ఇచ్చి, మళ్ళీ దాని మీద అభిప్రాయం కోసం తనే వెళ్ళడం

చవకబారుతనం అనిపించింది. అయినా నరసయ్యకూ బాధ్యత వుండాలికదా! అవతల రచయిత ఆదుర్దాతో వుంటాడని తెలుసుకోవద్దా? ఒకథ చదివి అభిప్రాయం చెప్పేందుకు ఇంతటైమ్ కావాలా? ఏమైనా, నరసయ్యే చెప్పేంతవరకూ, తను అంతగా పట్టించుకోనట్టు వుండటమే హుందాగా వుంటుందనిపించింది.

ఆ రోజు సత్యనారాయణ మార్కెట్ నుంచీ కూరగాయలు తీసుకెళ్తుండగా, రోడ్డుపక్కెనెవర్తోనో మాట్లాడుతూ నిల్చున్న నరసయ్య "ఆగండి, నేనూ వస్తున్నాను" అని కేకేశాడు. ఒకటి, రెండు నిమిషాల్లో వచ్చి సత్యనారాయణ్ణి కలుసుకుని "పదండి" అంటూ. "మనం మాట్లాడుకోటానికి ఎక్కడన్నా పదినిమిషాలుకూచుందామా! అదుగో ... ఆ హోటల్లోకి పోదాం. కాఫీ హోటళ్ళే ప్రస్తుతం మనకు కల్చరల్ సెంటర్స్" అంటూ దారితీశాడు. "రెండు కాఫీలు" అంటూ నరసయ్యే ఆర్డరిచ్చాడు. 'నరసయ్య హుషారుగావున్నట్టుంది, బహుశా తన కథనచ్చివుండొచ్చు.' అనుకున్నాడు సత్యనారాయణ. "మీ కథచదివాను. కథ చెప్పడం లో........ అంటే/సాంకేతికమైన నైపుణ్యంబావుంది" అని ఆగాడు. సత్యనారాయణ నరసయ్య ముఖంకేసి చూస్తోన్నాడు, 'ఇంకేమిటి బాగాలేదు' అన్నట్టు.

"అయితే, పేదలు పూర్తిగా మంచివాళ్ళయినట్టూ, డబ్బున్నవాళ్ళు పూర్తిగా చెడ్డవాళ్ళయినట్టూ చెప్పారే....... దాన్ని గురించి ఆలోచించవలసిన అవసరం వుంది"

"పేదల పక్షాన రాస్తున్న అభ్యుదయ రచయితలంతా అలాగే రాస్తున్నారు కదా"

"వాళ్ళు అభ్యుదయమంటే యేమిటో తెలీని అభ్యుదయ రచయితలయ్యుంటారు."

"కొందరైతే ఇంకా మూసలో రాస్తున్నారు. భూస్వామి/పాలేరు భార్యను మానభంగం చెయ్యడమూ, 'కుక్కముట్టిన కుండను ఇంక నీకు పనికిరాను మామా'/అంటూ ఆ అమ్మాయి ఏ ఏట్లోనో దూకి చావడం..... ఇట్లా"

"అంటే, ఆ అమ్మాయికి భూస్వామికంటే /ఆ రచయితే ఎక్కువ అన్యాయం చేశాడన్నమాట"

"ఎట్లా?"

"ఎట్లా ఏముంది?/భూస్వామి అత్యాచారం చేస్తే/రచయిత పూర్తిగా చంపేశాడు గదా!" ఈ తర్కం అర్థం చేసుకోడానికి సత్యనారాయణ ఆలోచిస్తున్నాడు.

"మరి..... ఆ కథకు ముగింపు ఎట్లా వుండాలంటారు?"

"ఆ కథకు ముగింపు సంగతి అట్లా వుండనీండి. భార్యాభర్తల సంబంధం గురించి ఆ రచయిత అర్థమేమిటి? భూస్వామి అవమానించిన తర్వాత ఆమె 'కుక్క ముట్టినకుండ' అయితే, అంతకుముందు కుక్కముట్టనికుండ...... అంతే! ఎంతరోతగా వుంది యీ అభ్యుదయం" నరసయ్య ముఖంలో కోపం బిగుసుకుంది. సత్యనారాయణ కొంచెం ఉలిక్కిపడినట్టు కాఫీ కప్పు అందుకున్నాడు.

పై రకం కథల్ని గురించి సత్యనారాయణ ప్రస్తావించాలనుకోలేదు. అవి పనికిమాలిన, హాస్యాస్పదమైన రచనలని సత్యనారాయణకు తెలుసు. అయితే, ఎందుకని చెప్పినట్టు? ఆ రకం కథలని అధమ రచయితలు కొందరు రాస్తున్నా, పేదలు హృదయం వున్నవాళ్ళూ, ధనికులు హృదయం లేని వాళ్ళూ అయినట్టు ఇప్పుడు పేరు పొందిన రచయితలు కూడా రాస్తున్నారు. నరసయ్య అదిసరైనది కాదని సూచించడంతో, తనని తాను సమర్థించుకునేందుకు ఆకథల సంగతి చెప్పినట్టుంది. అయితే, నరసయ్యేమంటాడు?

సత్యనారాయణ ఆసక్తిని గమనిస్తూనే, నరసయ్య మాట్లాడకుండా 'కాఫీ' తాగడం ముగించి, 'సిగరెట్' ముట్టించి, అప్పుడు ప్రారంభించాడు. "వర్గదృక్పథం వేరూ, పేదలు మంచివాళ్ళూ డబ్బున్నవాళ్లు చెడ్డవాళ్ళూ అని చెప్పడంవేరూ. తెలిసి చెప్పినా, తెలీకచెప్పినా అట్లా చెప్పిన రచయితలు పేదలకు అన్యాయం చేసినట్టే"

"అదెట్లా?" అన్నాడు సత్యనారాయణ.

"ఎట్లాగంటే....... అది ఒకరకంగా పేదలు పేదలుగా వుండాలని చెప్పడమే కనుక......"

"అట్లాచెప్పడం లేదే!"

"పేదలైనందువల్ల వీళ్ళు మంచి వాళ్ళు గానూ, ధనికులైనందువల్ల వాళ్ళు చెడ్డవాళ్ళుగానూ అయినట్టయితే, మంచివాళ్ళుగా వుండటమే మంచిది కదా! కనుక, పేదలు పేదలు గానే వుండాలి. ధనికులు వాళ్ళడబ్బు తోనూ, చెడ్డతనంతోనూ ఎట్లాగూ హాయిగా వుంటారు. పేదరికం వాళ్ళ పూర్వజన్మకృతం అని చెప్పడానికి, పేదలేమంచివాళ్ళు అని చెప్పడం మరోరూపం. అంతే! నిజానికి పేదరికం క్రూరమైనది. మనిషిలో వున్న మంచి తనానికి చోటు లేకుండా చేస్తుంది. 'స్వార్థం' ముందు కొస్తుంది. ఎవరికైనా సహాయం

చేయాలనుకున్నా, డబ్బున్నవాళ్ళకున్న అవకాశం పేదవాళ్ళకుండదు. మనం ఇప్పుడు సమాజంలో ఆర్థిక సమానతను కోరుతున్నామంటే ఎందుకు? ధనికులు చెడ్డవాళ్ళు అని చెప్పడం వల్లధనికులకే హానీ జరగదు. పేదలే మంచివాళ్ళు అని చెప్పడంవల్ల పేదలకు మరింత అన్యాయం జరుగుతుంది./పేదరికం ఆత్మగౌరవాన్నీ, మానవ విలువల్నీ పోగొడుతుంది కనుక పేదరికం పోవాలని కోరుకోవాలి కానీ, పేదలే మంచివాళ్ళని వాళ్ళని మభ్యపెట్టడం కాదు రచయితలు చెయ్యవలసింది." అని సిగరెట్ పీక కిటికీ గుండా మురిక్కాల్వలోకి విసిరేసి, లేచాడు నరసయ్య.

సత్యనారాయణ ఇప్పటికీ అప్పుడప్పుడూ కథలురాస్తూనే వున్నాడు. అయితే, అప్పటంత తేలిగ్గానూ ఎక్కువ సంఖ్యలోనూ రాయలేకపోతున్నాడు. ఇప్పుడు కథ రాయడమంటే, ఎవరికో ఏదో నేర్పుతున్నట్టుకాక, తనే నేర్చుకుంటున్నట్టు అనిపిస్తోంది. ఈ విధంగా నేర్చుకోడం చాలా ఆసక్తికరంగా వుంది సత్యనారాయణకు.

*(1975 'ఆంధ్రజ్యోతి' దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురితం)*

## -- కథ గురించి. . .

పేదల పట్ల సానుభూతితో రచనలు చేయడం మంచిదే. అయితే, అమాయకమైన, విచక్షణా రహితమైన సానుభూతి వల్ల వాళ్ళకు కలిగే మేలేమీ వుండదు. మార్క్సిస్టు దృక్పథంతో కథలు రాస్తున్నట్టు కనిపించే రచయితలు కూడా "పేదలంతా మంచివారూ, ధనికులంతాదుర్మార్గులూ" అని నిర్ధారణ అయినట్టు రాయడం సరైంది కాదనడానికి యీ కథ. ఒక రచయిత అనుభవం నుంచీ యీ అవగాహనను వ్యక్తం చెయ్యడం సహజంగా వుంటుందని, రచయితను పాత్రగా తీసుకోవలసి వచ్చింది.